క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



మురికి కాలువలను శుభ్రం చేయాలని డిమాండ్ చేస్తున్న మహిళలు

మిరుదొడ్డి(దుబ్బాక): దుర్గంధం వెదజల్లుతున్న మురికి కాలువలను వెంటనే శుభ్రం చేయాలని మిరుదొడ్డిలోని 6వ వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయాలని కోరుతూ స్థానికులు ఆదివారం ఆందోళనకు దిగారు. నెలల తరబడి మురికి కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగిందని, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోయారు. ప్రత్యేక పాలనాధికారులు పట్టించుకోకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పిందన్నారు. మురికి కాలువలు పందులు ఆవాసంగా మారాయని అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయాలని కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



గాగిళ్లాపూర్‌లో బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో కరువు కాటకాలు లేకుండా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



బెజ్జంకి(సిద్దిపేట): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ డిమాండ్ చేశా రు. బెజ్జంకిలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయి వెంటనే విడుదల చేయాలని కోరారు.

కామన్ యోగా ప్రొటోకాల్ వర్క్‌షాప్



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం వ్యాస మహర్షి యోగా కేంద్రంలో కామన్ యోగా ప్రొటోకాల్ వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్ సిద్దిపేట జిల్లా యోగా సన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి యోగా శిక్షకులు, విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, యోగా శిక్షకుడు తోట సతీష్, యోగా అసోసియేషన్ సభ్యులు గంగాపురం శ్రీనివాస్, తోట సంధ్య, బస్వ రాజకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

కోహెడరూరల్(హుస్నాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నాయని పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు మోసపోయారని, రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

విద్యార్థుల ఎంపిక

నంగునూరు(సిద్దిపేట): పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన నంగునూరు, నర్మేట, గట్లమల్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎంతో ముఖాముఖి కార్యక్రమానికి ఎంపికయ్యారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డితో ముఖాముఖిలో నంగునూరు విద్యార్థులు తేజస్విని, హారిక, వైష్ణవి, కృషిత, శ్రీహర్ష, అక్షయ పాల్గొంటారని హెచ్‌ఎం రామస్వామి తెలిపారు.

ఉరుకులు.. పరుగులు

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. నిమిషం నిబంధనతో అభ్యర్థులు ఉరుకులు.. పరుగులతో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. నిర్దేశిత సమయం తర్వాత వచ్చిన 16 మంది అభ్యర్థులు పరీక్షలకు దూరమయ్యారు. కలెక్టర్, సీపీ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.



పట్టణంలోని డిగ్రీకాలేజ్ వద్ద గ్రూప్1 పరీక్ష రాసేందుకు బారులు తీరిన అభ్యర్థులు



హాల్ టిక్కెట్ నంబర్లను సరిచూసుకుంటున్న అభ్యర్థులు



ఆలస్యంగా వచ్చి తిరిగి వెళ్తున్న యువకుడు



కుమారుడిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



బంగారం, బెల్ట్‌లను తీసివేస్తున్న అభ్యర్థి



పరీక్షా కేంద్రానికి వస్తున్న యువకుడు



పరీక్షా కేంద్రానికి వస్తున్న యువతి

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు

ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు పెంపుతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని, తమ ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు ఎన్‌సీసీ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించగా, క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ భవానీ క్యాడెట్లకు ఇచ్చిన శిక్షణ, శిబిర నివేదికను అందించారు. సంగారెడ్డి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పార్థసారథి నందా సతీమణి ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చిన్నయిదత్త హాజరై క్యాడెట్లకు పలు సూచనలు చేశారు. శిక్షణ ముగింపు సందర్భంగా క్రీడా విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి, ఉత్తమ సేవలందించిన క్యాడెట్లకు పతకాలు ప్రదానం చేశారు. క్యాంపు నిర్వహణకు సహకరించిన కలెక్టర్, సంక్షేమ అధికారులు, మెడికల్, మున్సిపల్ సిబ్బందికి పార్థసారథి నందా కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్‌సీసీ క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శన

కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో మహిపాల్‌రెడ్డి తదితరులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): ఢిల్లీలో కేంద్ర మంత్రులు బండి సంజయ్ కుమార్, కిషన్‌రెడ్డిలను ఆదివారం పలువురు బీజేపీ నాయకులు కలిశారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపినట్లు బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్‌రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లెలగడ్డ గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ విజయరాంరెడ్డి ఆదివారం తెలిపారు. ఆలిండియా ఎస్టీ కేటగిరిలో బి.అభిషేక్ 144 ర్యాంకు, ఎం. అశోక్ 1235, ఆర్.సంతోష్ 1283 ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన వారిని ఆర్‌సీఓ వెంకన్న, ప్రిన్సిపాల్ అభినందించారు.



వడియారం రైల్వే స్టేషన్

వడియారంలో ఆగనున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

చేగుంట(తూప్రాన్): ఇటీవల ప్రారంభమైన రెండు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మండల కేంద్రమైన చేగుంటలోని వడియారం రైల్వే స్టేషన్‌లో ఆగేందుకు అనుమతి ఇచ్చారు. కాచిగూడ నుంచి రాజస్థాన్‌లోని బికనీర్‌కు వెళ్లే లాల్‌ఘర్ ఎక్స్‌ప్రెస్ ఈ రైల్వేస్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగుతుంది. ప్రతి శనివారం కాచిగూడ నుంచి వెళ్లే ఈరైలు రాత్రి 10:50కు వడియారం స్టేషన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గురువారం ఉదయం 6:06 నిమిషాలకు వడియారం స్టేషన్ చేరుకొని నిమిషం పాటు ఆగి కాచిగూడకు వెళుతుంది. ఈ రైలు తెలంగాణ నుంచి మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండనుంది. ఇదే రూట్లో మరో వీక్లీ హిసార్ ఎక్స్‌ప్రెస్ ఐదు రాష్ట్రాల మీదుగా ప్రయాణించనుంది. గురువారం కాచిగూడ నుంచి బయలుదేరి సాయంత్రం 4:30కు వడియారం స్టేషన్‌కు చేరుకుని రెండు నిమిషాల పాటు ఆగుతుంది. ఈరైలు తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ మీదుగా హర్యానాలోని హిసార్ జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ రెండు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వడియారం స్టేషన్‌లో నిలపడంతో సమీప పట్టణాల నుంచి ఐదు రాష్ట్రాలకు చేరుకునే ప్రయాణికులకు సౌకర్యంగా మారనుందని వడియారం రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ మెంబర్ గణేశ్ రవికుమార్ పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో హోటల్ యజమాని మృతి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలోని పందిల్లలో దాబా హోటల్ యజమాని ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం ధూలిమిట్ట మండలం కొండాపూర్ శివారులోని హన్మతండాకు చెందిన ఉమేశ్‌నాయక్, శారద దంపతులు బతుకు దెరువు కోసం పందిల్ల రైస్ మిల్లు వద్ద దాబా హోటల్ నడుపుతున్నారు. హోటల్ వెనుక చేపల మడుగు ఉంది. చేపల కోసం కరెంట్ పెట్టేందుకు వైరును మడుగులో వేశాడు. ప్రమాదవశాత్తు కాలుజారి మడుగులో పడటంతో విద్యుత్ షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాడు. భర్త అరుపులు విని భార్య శారద స్థానికులకు చెప్పడంతో వారు వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 18, 19, 20 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రామగల్ల నరేష్ కోరారు. ఆదివారం అంబేద్కర్ కూడలి వద్ద శిక్షణా తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని, గడిచిన పదేళ్లలో ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో దళితుల పట్ల వివక్ష కొనసాగిస్తున్నారన్నారు. ఈ వివక్ష పోవాలంటే దళితులంతా ఏకమై అంబేద్కర్ రాసిన రాజ్యాంగ రక్షణలో భాగంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల హక్కుల రక్షణ కోసం యాదగిరిగుట్టలో జరిగే శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఇంటిని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్: తన ఇంటిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు నష్ట పరిహారం చెల్లించాలని ఆదివారం హుస్నాబాద్‌కు చెందిన ఇంటి యజమాని కవ్వ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశాడు. 14 ఏళ్ల క్రితం తన ఇంటిని ఎక్సైజ్ కార్యాలయానికి అద్దెకు ఇచ్చినట్లు తెలిపాడు. అయితే తనకు చెప్పకుండా ఖాళీ చేసి మరో భవనానికి కార్యాలయాన్ని మార్చారన్నారు. 14 నెలల అద్దె చెల్లించలేదని ఆరోపించాడు. కొన్ని గదుల పైకప్పు కూలిపోయాయని, గదిలో భద్రపరిచినన ఫైళ్లను కాల్చి వేశారని తెలిపాడు. తగులబెట్టినవాటిలో భారత ప్రభుత్వ చిహ్నంతో ఉన్న టోపీలు ఉన్నాయన్నారు. విచారణ జరిపి తనకు రావల్సిన అద్దె, నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు.

పదవి కొనుక్కునే స్థాయికి దిగజారలేదు

ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి



కొమురవెల్లి(సిద్దిపేట): ఆలయ చైర్మన్ పదవిని కొనుక్కునే స్థాయికి తాను దిగజారలేదని, సీపీఎం పార్టీ వద్ద ఆధారాలు ఉంటే నిరూపించాలని ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం పార్టీ నాయకులు తనపై చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్లే ప్రజలు ఆ పార్టీ నాయకులను దద్దమ్మల్లా చూస్తున్నారన్నారు. తనపై, తమ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేసే చూస్తూ ఊరుకోబోమని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుపయోగంగా అతిథి గృహం



నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం వద్ద భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ రూ.లక్షలు వెచ్చించి గెస్ట్ హౌస్ నిర్మించింది. నిర్వహణ బాధ్యత ఎవ్వరూ తీసుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. 2005 జనవరి 12న అప్పటి ప్రభుత్వం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ. 25 లక్షలు మంజూరు చేసింది. నాటి మంత్రి గీతారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే సంవత్సరంలో అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తి చేశారు. వసతుల కల్పనకు మరిన్ని నిధులు వెచ్చించారు. భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గ్రామస్తుల వినతి మేరకు ఆరేళ్ల క్రితం హరీశ్‌రావు మరిన్ని నిధులు మంజూరు చేశారు. అయినా భవనాన్ని పట్టించుకునే వారు లేరు. సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్లు

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని తోటపల్లి, బెజ్జంకి క్రాసింగ్ వరకు రాజీ వ్ రహదారి ధ్వంసమవడంతో కొంత మరమ్మతులు చేసి మిగిలింది వదిలేశారు. నిత్యం వేలాది వాహనాలు ఈరోడ్డు గుండా రాకపోకలు సాగిస్తాయి. దెబ్బతిన్న ప్రాంతంలో వాహనాలు అదుపు తప్పడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని గుండారం-చిన్నకోడూర్ మండలంలో ని కిష్టాపూర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు బీటీ రోడ్డును తవ్వారు. ఎనిమిది నెలలు కావస్తున్న రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులతో పాటు సిద్దిపేటకు వెళ్ల వారు అసౌకర్యానికి గురవుతున్నారు. వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు మరమ్మతు కోసం తవ్విన బీటీ రోడ్డు

ఆత్మీయ సమ్మేళనాలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలు ఆయా పాఠశాలల్లో ఘనంగా జరిగాయి. 10 వ తరగతి చదివిన విద్యార్థులు రెండున్నర దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో సందడి చేశారు. వృత్తి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. పరస్పర యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



పాలమాకుల ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్ విద్యార్థులు



దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్



చేర్యాల జిల్లా పరిషత్ సెకండరీ బాలుర పాఠశాలలో 1997-98 బ్యాచ్ విద్యార్థులు



గజ్వేల్‌లో 2003-04 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



సలాక్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 బ్యాచ్ టెన్త్



నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 బ్యాచ్